# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 13 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 23 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




అట్టహాసంగా

## 'పద్మ' అవార్డులు

### పద్మ విభూషణ్ అందుకున్న వెంకయ్య నాయుడు, చిరంజీవి

### బంగ్లాదేశ్ సింగర్ రెజ్వానాకు పద్మశ్రీ

### 132 మందికి పద్మ అవార్డులు అందజేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మశ్రీ పురస్కారాల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. అవార్డు గ్రహీతులకు పురస్కారాలు అందజేశారు. కళారంగంలో బంగ్లాదేశ్ గాయని రెజ్వానా చౌదరి బన్యాకు

..మిగతా 2లో



అరుణాచల్‌ప్రదేశ్‌లో

## 8 కేంద్రాల్లో రీ పోలింగ్

రీ పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

2



## మోడీకి ప్రత్యామ్నాయం లేదు

2

ఎవరి నోట విన్న ఒక్కటే మాట మోడీ మోడీ

బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

ఆగస్టు 15లోపు

# రైతులకు రుణమాఫీ

### ఆదిలాబాద్, నిజామాబాద్ పరిశ్రమలను పునరుద్ధరిస్తాం

చక్కెర కర్మాగారాలను తెరిపించి రైతులను ఆదుకుంటాం

బిజెపి ప్రకటించిన పసుపుబోర్డుపై స్పష్టత కరవు

దేవుడిపేరుతో మోసం చేస్తున్న బిజెపి

ఎన్నికల జనజాతర సభల్లో సీఎం రేవంత్ రెడ్డి





ఆదిలాబాద్/నిజామాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): సెప్టెంబర్ 17లోపు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ పేరు లేదన్నారు. నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు అని స్పష్టంగా చెప్పకుండా నోట్ విడుదల చేశారని విమర్శించారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు అయ్యాక బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియదన్నారు. 'నిజామాబాద్ అంటే నాకు ప్రత్యేక అభిమానం. అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించాం. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. కవిత ఎంపీగా ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదు. పసుపు బోర్డు ఏర్పాటుపై బాండు రాసి ఇచ్చి భాజపా ఎంపీ అర్వింద్ మోసం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. చక్కెర పరిశ్రమ, పసుపు బోర్డులను జీవన్‌రెడ్డి సాధిస్తారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలి' అని

..మిగతా 2లో



ఆ మాట నిలబెట్టుకోకుంటే

## రాజీనామా చేస్తావా?

### రేవంత్‌కు హరీశ్ సవాల్

సంగారెడ్డి, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు. సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో హరీశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోపు రూ. 39 వేల కోట్లు రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తారా? హరీశ్ రావు సవాల్ విసిరారు. ఇప్పటివరకు రైతుబంధు పూర్తిగా ఇవ్వలేదని, ఇంకా పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తా అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలే ఆ పార్టీకి భస్మాసుర హస్తం అవుతాయన్నారు. భువనగిరి కాంగ్రెస్ సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. తనను ఎందుకు ఓడించాలో చెప్పాలంటున్నారు. వారిని ఓడించడానికి 100 కారణాలు ఉన్నాయని హరీశ్ రావు చెప్పుకొచ్చారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2500 సహాయం,

..మిగతా 2లో


## లిక్కర్ కేసులో కవితకు బిగ్‌షాక్..

### బెయిల్ పిటిషన్స్ పై విచారణ వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు మరో బిగ్ షాక్ తగిలింది. లిక్కర్ పాలసీ ఈడీ కేసులో కవిత బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. ఇరువురి వాదలను విన్న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేస్తున్నట్లు

..మిగతా 2లో



రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్ల బృందం

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డిని

## భారీ మెజార్టీతో గెలిపించాలి

### సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు

బండ్లగూడ, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సోమవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు నువ్వేం నరేందర్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... చేవెళ్లలో డాక్టర్ రంజిత్ రెడ్డి గెలుపు ఖాయం అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు



బండ్లగూడ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్ ఎం లత ప్రేమ్ గౌడ్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

వామ్మో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆస్తి

## మామూలుగా లేదుగా!





రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర రెడ్డి అత్యంత సంపన్నుడు.బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కొండా విశ్వేశ్వర రెడ్డి. అతని కుటుంబ ఆస్తుల విలువ రూ.4,568 కోట్లుగా అఫిడవిట్ లో పొందుపరిచారు.కొండా పేరు మీద రూ.1240 కోట్లు, అతని సతీమణి పేరు మీద రూ.3,208 కోట్లు, కుమారుడు పేరు మీద రూ.108 కోట్ల ఆస్తులు ఉన్నట్లు నామినేషన్ పత్రంలో పొందుపరిచారు.

## మరో పదిరోజుల్లో 10 ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు మరో 10 రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం నుంచి అనుమతి రావడంతో ఫలితాల వెల్లడికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టెన్త్ జవాబపత్రాల మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ 20తో ముగిసింది. ఫలితాలను డీకోడింగ్ చేయడానికి మరో వారంరోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో 10 రోజుల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తిచేసి ఏప్రిల్ 30న ఫలితాలను వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఏప్రిల్ 30న కుదరని పక్షంలో మే 1న పదోతరగతి ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ దృష్ట్యా మంత్రులుకాకుండా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం వీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 2,57,952 మంది బాలురు కాగా.. 2,50,433 మంది బాలికలు ఉన్నారు. ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి జవాబపత్రాల స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ మొదలైంది.





లోక్‌సభ ఎన్నికల్లో

## బీజేపీ తొలి విజయం

### ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖేష్ దలాల్

సూరత్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌కు చెందిన నీలేష్ కుంభానీ నామినేషన్ పత్రాలపై చేసిన సంతకంతో వ్యత్యాసం ఉందని జిల్లా రిటర్నింగ్ అధికారి ఆయన నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. అయితే ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి 'ముఖేష్ దలాల్' మినహా మిగిలిన బ్యర్థులందరూ తమ నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న అభ్యర్థి ప్రస్తుతం ఒక్కరు (ముఖేష్ దలాల్) మాత్రమే మిగిలారు. దీంతో ఈయన ఏకగ్రీవంగా గెలుపొందారు. ఎన్నికల ఫలితాలు ఇంకా వెలువడకముందే గుజరాత్‌లో బీజేపీ బోణీ కొట్టిందని స్పష్టమవుతోంది. గుజరాత్‌లో లోక్‌సభ ఎలక్షన్లలో పోటీ చేయడానికి కాంగ్రెస్, ఆప్ పార్టీలు రెండూ పొత్తు పెట్టుకున్నాయి. పొత్తు కుదిరిన తరువాత కాంగ్రెస్ 26 స్థానాలకు గాను కాంగ్రెస్ 24 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, ఆప్ భావ్‌నగర్, భరూచ్‌లలో తమ అభ్యర్థులను బరిలోకి దింపింది.

# ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ

మొదటి పేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ లో ఎంపీ అభ్యర్థిగా ఉన్న జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు. నిజామాబాద్ లో పెండింగ్ లో ఉన్న పనులన్నీ చేసే పూచీ తనదే అని హామీ ఇచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని కూడా త్వరలో తెరిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వీలైతే సెప్టెంబరు 17లోపు చక్కెర కర్మాగారాలను తెరిపించే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని చెప్పారు. గతంలో 2014 ఎన్నికల సమయంలో కవిత ఎంపీగా ఎన్నికకాక ముందు వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి చేయలేదని అన్నారు. అందుకే చైతన్యవంతం గల నిజామాబాద్ రైతులు కవితను, ఆమె జెండాను 100 మీటర్ల లోతులో పాతిపెట్టి.. 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా భయపడే పరిస్థితికి తెచ్చారని అన్నారు. వెనకటికి ఎవడో తాతకు దగ్గు నేర్పినట్లుగా రైతులను మభ్యపెట్టేటట్లుగా స్పైసెస్ బోర్డును పసుపు బోర్డుగా నమ్మబలుకుతున్నారని అన్నారు. నిజామాబాద్ రైతులకు అండగా వారి గళాన్ని పార్లమెంటులో వినిపించడం కోసం జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రభుత్వం ఏర్పడుతుందని.. ఆ ప్రభుత్వంలో జీవన్ రెడ్డి వ్యవసాయ మంత్రి అవుతారని రేవంత్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించి మరీ జీవన్ రెడ్డిని వ్యవసాయ మంత్రిని చేసే బాధ్యత నాదే అని అన్నారు. చక్కెర కర్మాగారాన్ని, పసుపు బోర్డును తెచ్చే సత్తా జీవన్ రెడ్డికి ఉందని అన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'త్వరలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తాం. కొమురం భీం ఆశయ సాధనకు కృషి చేస్తాం. ఇంద్రవెల్లి ప్రాంతంలో స్మృతి వనం నిర్మిస్తాం. కుప్టి ప్రాజెక్టును పూర్తి చేస్తాం.. కడెం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేశాం. తుమ్మిడి హట్టి వద్ద ప్రాణహిత నదిపై చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తాం. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాం. దానికి బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెడతాం అని వివరించారు. కాంగ్రెస్ ను పడగొట్టిన, ఓడ గొడితే పేద ప్రజలకు నష్టం. గల్లీలో ఉన్న



కేసీఆర్, ఢిల్లీలో ఉన్న మోదీ మా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు. కేసీఆర్ ను మోదీని వంద అడుగుల లోతులో బొందపెట్టాలి, నడి రోడ్డులో ఉరి తీయాలి అన్నారు. వీళ్లిద్దరూ తోడు దొంగలు. వీళ్ళను బండ కేసి కొట్టాలన్నారు. ఆదిలాబాద్ లో ఇక్కడి విద్యార్థుల కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. ఆదిలాబాద్ లో సీసీఐ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. ఆర్టీసీ బస్సులో మహిళకు ఉచిత ప్రయాణం అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ది. ఇప్పటిదాకా రూ.1300 కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించాం. రాజీవ్ ఆరోగ్య శ్రీని కేసీఆర్ రిమ్మ మత్తులో నిర్లక్ష్యం చేశారు. మన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోదీ కూలగొట్టాలని చూస్తున్నాడు. 40 లక్షల కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నాం. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత పథకాన్ని చూసి కేసీఆర్, మోదీ కండ్లు మండుతున్నాయి. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే ఈ పథకాలు అమలు అవుతాయా ఆలోచించండి' అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఒక్కోసారి ఓటమి కూడా గెలుపుకు పునాది వేస్తుందని చెప్పారు సీఎం. తాను 2018 ఎన్నికల్లో ఓడిపోతే మాల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచి కాంగ్రెస్ అధిష్టానాన్ని అకర్షించి... పీసీసీ చీఫ్, సీఎం అయ్యాయని గుర్తుచేశారు. జీవన్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయారని ఎంపీగా ఆయనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆరో గ్యారంటీ రుణమాఫీ పథకం చేపట్టేలోపే.. ఎన్నికల కోడ్ వచ్చిందని.. ఎన్నికల కోడ్ ముగియగానే రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని సీఎం హామీ ఇచ్చారు. ఆగస్టు15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. రైతులు ఎంత పంట పండించిన 500 రూపాయిలు బోనస్ ఇచ్చి ప్రతి గింజ కొంటారని తెలిపారు. ప్రదాని మోడీ ఓటమి భయంతోనే మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. హిందువుల ఆస్తులు ముస్లింలకు పెడతామని మోడీ తప్పుడు ప్రచారం చేస్తున్నారనని చెప్పారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నం చేస్తోంది ఆరోపించారు. దేశాన్ని మత సామరస్యానికి చిహ్నంగా ఉండేలా రాజ్యాంగం చేసిందన్నారు సీఎం.



## ఆ మాట నిలబెట్టుకోకుంటే రాజీనామా చేస్తావా?

మొదటి పేజీ తరువాయి...

కల్యాణ లక్ష్మికి తులం బంగారం, నిరుద్యోగ భృతిపై మాట తప్పినందుకు కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు హరీశ్ రావు సూచించారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానంటూ, ఎవరి చెవుల్లో పువ్వు పెడుతున్నారు. ఏకకాలంలో రూ.39 వేల కోట్లు రుణమాఫీ చేయకపోతే, సీఎం పదవికి రాజీనామా చేయటానికి రేవంత్ రెడ్డి మీరు సిద్ధమా? ఎన్నికల ప్రచారాల్లో దేవుడ్ని వాడుకోవటం కాదు. మీరు వంద రోజుల్లో ఈ హామీ ఎందుకు నెరవేర్చలేదు. ప్రమాణ స్వీకారం అనంతరమే చేస్తానని మాట ఏమైంది? అన్ని అబద్ధపు మాటలు చెప్పుకుంటూ మీ ప్రభుత్వం అధికారమెక్కింది అంటూ కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు హరీశ్ రావు. రేవంత్ రెడ్డి అంటే మాటల కూతలు, కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలు అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నాలుగున్నర నెలల్లోనే సీఎం ఏదేదో చేసినట్టు ఓటేయకపోతే పథకాలు బంద్ అవుతాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కరవు, కరెంట్ కోతలు, మంచినీళ్ల కష్టాలు, అవినీతి అని హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి మాటలు సీఎం స్థాయికి తగినట్లుగా లేవని హరీశ్ అన్నారు.



## అట్టహాసంగా 'పద్మ' అవార్డులు

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మశ్రీని ప్రదానం చేశారు. భజన-గాయకుడు కాలూరామ్ బమానియాకు పద్మశ్రీని అందజేశారు. ఇక వైద్యరంగంలో తేజస్ మధుసూదన్ పటేల్‌కు పద్మభూషణ్, వాణిజ్యం, పరిశ్రమల రంగంలో సీతారాం జిందాల్‌కు పద్మభూషణ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. ఇక ఈ కార్యక్రమంలో పద్మవిభూషణ్ పురస్కారాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న ఈ జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనలో భాగంగా ఐదుగురికి పద్మ విభూషణ్ లు, 17 మందికి పద్మభూషణ్ లు, 110 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు సినీ నటుడు కొణిదెల చిరంజీవికి కూడా పద్మవిభూషణ్ అవార్డుకు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హెూం శాఖ మంత్రి అమిత్ షా, పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. పురస్కారాల గ్రహీలను చప్పట్లతో ప్రధాని మోడీ అభినందించారు. పద్మవిభూషణ్ పురస్కారాన్నిమాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న ఈ జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనలో భాగంగా ఐదుగురికి పద్మ విభూషణ్ లు, 17 మందికి పద్మభూషణ్ లు, 110 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు సినీ నటుడు కొణిదెల చిరంజీవికి కూడా పద్మవిభూషణ్ అవార్డుకు ఎన్నికయ్యారు. ఈ లిస్ట్ లో మన తెలుగు వారు నారాయణపేటకు చెందిన బుర్ర వీణ వాద్యకారుడు దాసరి కొండప్ప, జనగాంలోని చిందు యక్షగానం రంగస్థల కళాకారుడు గడ్డం సమ్మయ్య లకు పద్మశ్రీలు, అలాగే కళా రంగానికి చెందిన ఎ.వేలు ఆనందాచారి కూడా వారే. సాహిత్యం విద్యా రంగంలో కేతావత్ సోమ్‌లాల్, కూరెళ్ల విట్టలాచార్యలకు కూడా ఈ అవార్డ్స్ దక్కనున్నాయి. ఏపీ నుంచి తొలి మహిళా హరికథా వ్యాఖ్యాత ఉమా మహేశ్వరి కూడా అవార్డ్స్ లో చోటు దక్కించుకున్నారు.

## లిక్కర్ కేసులో కవితకు బిగ్‌షాక్

మొదటి పేజీ తరువాయి...

వెల్లడించింది. కాగా, సీబీఐ కేసులో కూడా కవితకు తీవ్ర నిరాశ ఎదురైంది. లిక్కర్ పాలసీ కేసులో భాగంగా ఈడీ అరెస్ట్ లో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కవిత ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా కవిత తరపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. విచారణకు సహకరిస్తున్న కవితను అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదని కోర్టులో కవిత తరఫు న్యాయవాది వెల్లడించారు. 'అరుణ్ రామచంద్రన్ పిళ్ళై 10 స్టేట్మెంట్స్ ఇచ్చారు. అరుణ్ రామచంద్రన్ పిళ్ళైను ఈడీ అరెస్ట్ చెయ్యలేదు. కవితకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. అనుమనితురాలిగా కూడా లేని కవితను నిందితురాలిగా మార్చారు. 5,6 గంటలు విచారణకు హాజరైన ఒక టెర్రరిస్టు, కరుడుగట్టిన నేరస్థులను ట్రీట్ చేసినట్లు చేశారు. మార్చి 15న చట్టవిరుద్దంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత- కేజ్రీవాల్ లను కలిపి విచారించడంలో ఈడీ విఫలం అయింది. విజయ్ నాయర్ సోషల్ మీడియా హ్యాండ్లర్, ఆయనతో సోషల్ మీడియా అంశం పైనే కవిత భేటి అయ్యింది. బుచ్చిబాబు నాలుగు స్టేట్మెంట్స్ ఇచ్చాడు. ఈడీ అనుకూలంగా స్టేట్మెంట్ ఇచ్చాక ఆయనకు బెయిల్ వచ్చింది. రాఘవ రెడ్డి బీజేపీ నుంచి పొత్తులో ఉన్న పార్టీ నుంచి పోటీలో ఉన్నాడు. బీజేపీకి ఎలాక్టోరల్ బాండ్లను శరత్ రెడ్డి కొనుగోలు చేసి అందించారు. వీళ్ళు ఇచ్చిన స్టేట్మెంట్స్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత ఆధారాలు ధ్వంసం చేశారు అంటున్నారు.. కానీ, ఆవిడ వాడిన ఫోన్లన్నీ ఈడీకి ఇచ్చారు' అని కవిత తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. అయితే ఈడీ తరపున న్యాయవాది జోయబ్ హెూస్సేన్ కోర్టులో కవితకు వ్యతిరేకంగా వాదనలు వినిపించారు. లిక్కర్ కేసులో భాగంగా ఈడీ కవితను ఫోన్లు అడిగిన తర్వాత ఆమె ఫోన్లను ఫార్మాట్ చేశారంటూ కోర్టు ముందు వెల్లడించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న రౌస్ అవెన్యూ కోర్టు.. విచారణను రేపటికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ పిటిషన్ పై మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా.. సీబీఐ కేసులో కూడా కవితకు మరో షాక్ తగిలింది. లిక్కర్ కేసులో భాగంగా సీబీఐ అరెస్ట్ లో బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీ కవిత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ లో భాగంగా ఇరువురి న్యాయవాదుల వాదనలు విన్న జడ్జి కావేరి బవేజ తీర్పును మే 2వ తేదీకి వాయిదా వేశారు. కవిత తరఫున ఢిల్లీ కోర్టులో వాదనలు వినిపించిన న్యాయవాది.. 'మహిళగా కవిత పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హురాలు. అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి మెటీరియల్ లేదు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారు. ఈడి కస్టడీలో ఉండగా, సీబీఐ ఎందుకు అరెస్ట్ చేసింది?.. అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేనప్పటికీ అరెస్టు చేశారు. కవిత బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్. చిదంబరం కేసులో తీర్పు కవిత విషయంలో సరిపోతుంది. ఏడేళ్ల లోపల శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదు. అరెస్టుకు సరైన కారణాలు లేవు' అంటూ వాదించారు.సీబీఐ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది కవితకు ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును కోరారు. 'కవితకు బెయిల్ ఇవ్వొద్దు. కవిత దర్యాప్తును ప్రభావితం చేయగలుగుతారు. కవిత లిక్కర్ కేసులో కీలక వ్యక్తిగా ఉన్నారు' అంటూ కోర్టులో వెల్లడించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును మే 2వ తేదీకి రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

## సైదాబాద్ పీఎస్ విమెన్ ఏఎస్సై ఉమాదేవిని సస్పెండ్ చేసిన హైదరాబాద్ సీపీ



హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) హైదరాబాద్ బీజేపీ ఎంపి అభ్యర్థి మాధవి లత ప్రచారం చేస్తుండగా.. హగ్ చేసుకున్న కారణంగా మహిళ ఏఎస్సై ఉమాదేవి ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సస్పెండ్ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బిజెపి అభ్యర్థి మాధవి లతను మహిళా ఎస్సై ఉమాదేవి ఆలిందనం చేసుకోవటం జరిగింది దీంతో విచారణ చేసి సస్పెండ్ చేసి సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆమెను సస్పెండ్ చేశారు.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో 8 కేంద్రాల్లో రీ పోలింగ్

### రీ పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

అరుణాచల్‌ప్రదేశ్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 19న ప్రశాంతంగా ముగిసింది. అయితే తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం.. అరుణాచల్‌ప్రదేశ్‌లోని 8 కేంద్రాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని సోమవారం ఆదేశించింది. ఏప్రిల్ 24వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల మధ్య ఈ రీపోలింగ్ నిర్వహించాలని స్పష్టం చేసింది. తూర్పు కమెంగ్ జిల్లాలోని బమెంగ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సరియో, కురుంగ్ కుమేలో న్యాపిన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని లంగేతే లత్, దింగ్సర్, బొగియా సియుమ్, జింబారితోపాటు అప్పర్ సుబాన్సిరి జిల్లాలోని నాకో అసెంబ్లీ నియోజకవర్గంలోని లెంగి కేంద్రాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని స్పష్టం చేసింది.గత శుక్రవారం అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికలు కూడా జరిగాయి. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో హింస చెలరేగింది. దీంతో ఈవీఎంలు సైతం దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఉన్నతాధికారులు నివేదిక అందించారు. అనంతరం ఎనిమిది కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలను ఈసీ జారీ చేసింది.అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అందులో 10 మంది ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలి దశలో 102 లోక్‌సభ స్థానాలతో పాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఎన్నికల జరిగాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎనిమిది కేంద్రాల్లో రీ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ఆదేశించింది.దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 19న ముగిసింది. ఇక సెకండ్ విడత ఏప్రిల్ 26న జరగనుంది. అనంతరం మే 7, 13, 20, 25, జూన్ 1న జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి. ఇదిలా ఉంటే 400 సీట్లకు పైగా బీజేపీ గెలుచుకుంటుందని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక గుజరాత్‌లోని సూరత్ స్థానాన్ని ఏకగ్రీవంగా గెలుచుకున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## మోడీకి ప్రత్యామ్నాయం లేదు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తన వ్యంగాస్త్రాలతో మాటల దాడికి దిగుతున్నారు. బీజేపీకి ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. దేశంలో మోడీకి ప్రత్యామ్నాయం లేదని.. ఏ పార్టీ కూడా మోడీకి ప్రత్యామ్నాయం కాదన్నారు. ఏ ఇంట్లో చూసినా.. ఎవరి నోట విన్న ఒక్కటే మాట మోడీ మోడీ అని ఆయన పేర్కొన్నారు. దేశంలో మాఫీయా లేదు.. గుండాయిజం లేదు.. మోడీ వచ్చాక దేశం శాంతియుతంగా ఉందన్నారు. దేశం మోడీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందన్నారు. మోడీ ఒక్కసారి కూడా సెలవు తీసుకోలేదని.. మోడీ ప్రధాని అయినప్పుడే.. కేసీఆర్ కూడా ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. కేసీఆర్ ఒక్కరోజు కూడా ఆఫీస్ కు రాలేదని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ మొత్తం ఫాం హౌజ్‌లోనే ఉన్నాడని.. కేసీఆర్ ఒక విచిత్రమైన జంతువు.. ఎప్పుడు బయటకు వస్తాడో తెలియదని కిషన్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.



మార్లబీడు గ్రామంలో ధ్వజారోహణ పూజల్లో పాల్గొని కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## మార్లబీడు గ్రామంలో వైభవంగా ధ్వజస్తంభ మహెూత్సవం

### పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ధ్వజస్తంభాన్ని నిలబెడుతున్న గ్రామ భక్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) గద్వాల నియోజకవర్గం పరిధిలోని ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో గల శ్రీఅంజనేయ స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహెూత్సవం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచి సేవాకాలం, అలంకరణ, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ , యంత్ర ప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం వేద పారాయణాల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల మండలాలు గ్రామాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు. ఈ మహెూత్సవ కార్యక్రమానికి హాజరైన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జెడ్పిటిసిలు పద్మావెంకటేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, వైఎస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి లతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## ధరూర్‌లో వైభవంగా బండారు మహెూత్సవం



బీరప్ప స్వామిని దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ నాయకుడిని సన్మానిస్తున్న కురువ కుల పెద్దలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలో కురువ సామాజిక వర్గానికి చెందిన ఆదిగొండ గోత్రం ఆధ్వర్యంలో నిర్వహించే బీరప్ప మహెూత్సవాలు సోమవారం కురువలు వైభవంగా జరుపుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వందలాది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సోమవారం ఉదయం భీమలింగేశ్వర స్వామి గుడి వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బీరప్ప దేవుడికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం గుడి వద్ద హెూమం నిర్వహించి అన్నదానం చేశారు. బీరప్పను ఇంటి దేవుడిగా కొలిచే వారు కుటుంబ సమేతంగా బండారు మహెూత్సవంలో పాల్గొనగా బంధువులు పసుపు చల్లి ఆశీర్వదించారు. ఈ బండారు మహెూత్సవంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం బండారు మహెూత్సవంలో పాల్గొని పుసుపు చల్లారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు బండారు మహెూత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్వ పెద్దలు ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులను సన్మానించారు.

# చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి



చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంకకు నామినేషన్ పత్రాలు అందచేస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి. చిత్రంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



రాజేంద్రనగర్‌లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ ర్యాలీ



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్



కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ఆయన సతీమణి కొండ సంగీతారెడ్డి

బుద్వేల్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం తన నామినేషన్ ను దాఖలు చేశారు రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక కు ఆయన తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, శాసనమండలి సభ్యుడు ఏవీఎన్ రెడ్డి లు పాల్గొన్నారు.

### దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలు ఇవి: కేంద్ర మంత్రి పియూష్ గోయల్

భారతదేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలు అని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అన్నారు. రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి వేసిన నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు . కేంద్రంలో బీజేపీకి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అడ్డు ఎవరు లేరన్నారు. ఇండియా కూటమిలో లుకలుకలు ఏర్పడ్డాయని జోస్యం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. భారతదేశాన్ని విశ్వశక్తిగా మార్చేందుకు ప్రధాని నాయకత్వంలో పని జరుగుతున్నది అన్నారు. తెలంగాణలో బీజేపీ క్లీన్ స్వీప్ చేయబోతుందన్నారు.

### దేశం కోసం పరితపించే వ్యక్తిని తిరిగి ప్రధానిగా ఎన్నుకోవాలి : కొండా సంగీతా రెడ్డి :


ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశం కోసం పరితపించే వ్యక్తిగా పనిచేస్తున్నాదని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీతా రెడ్డి అన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలను కాపాడడానికి ప్రధానమంత్రి చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్ , రాణి రుద్రమ , తోకల శ్రీనివాస్ రెడ్డి, పి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొలన్ రంగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి

## కొలన్ రంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి సబితా

బుద్వేల్, ఏప్రిల్22(ప్రభాత ఉదయం): హైదర్‌గూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి సోదరుడు కొలన్ రంగారెడ్డిని సోమవారం మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి పరమర్శించారు. కొలన్ రంగారెడ్డి భార్య ఈశ్వరమ్మ (83)ఆదివారం మరణించారు. కొలన్ రంగారెడ్డిని పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి ఆయనకు ధైర్యం చెప్పారు. భగవంతుడు పిలుచుకున్నాడని బాధపడవద్దన్నారు. కుమారుడు కొలన్ దరంపాల్ రెడ్డిని ఓదార్చారు. కొలన్ కుటుంబ సభ్యులతో తమ కుటుంబానికి మంచి స్నేహం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి సుధాకర్ రెడ్డి, బండారి రమేష్, కొలన్ రంగారెడ్డి సోదరులు కొలన్ ప్రతాప్ రెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, కుటుంబ సభ్యులు కొలన్ సుధాకర్ రెడ్డి, కొలన్ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వర్గీయ పి. ఇంద్రారెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఆయన తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్

## రంగారెడ్డి జిల్లా ప్రజల గుండెల్లో చిరస్మరణీయులు ఇంద్రారెడ్డి

బుద్వేల్, ఏప్రిల్22(ప్రభాత ఉదయం):రంగారెడ్డి జిల్లా ప్రజల గుండెల్లో చిరస్మరనీయుడుగా స్వర్గీయ పి . ఇంద్రారెడ్డి నిలిచిపోయారని ఆయన కుమారుడు ఇంద్రారెడ్డి స్మారక ట్రస్ట్ చైర్మన్, బీ ఆర్ ఎస్ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. ఉప్పర్ పల్లి కు చెందిన సామా ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పీడీపీ చౌరస్తాలో ఇంద్రన్న 24వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి . అర్చన జయ ప్రకాష్, నాయకులు డి. రమేష్ ముదిరాజ్, పచ్చ శ్రీనివాసులు జాలిగం చిత్తారి, పి.రమేష్ చారి, కొత్త రాజశేఖర్ రెడ్డి, పచ్చ నర్సింగ్ రావు, డాక్టర్ వి శ్రీరాములు, ఎడ్లకాడి సూర్యం, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమం

## అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

బుద్వేల్, ఏప్రిల్22(ప్రభాత ఉదయం): కిస్మత్ పూర్ లోని చారిత్రత్మకమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవం అనంతరం కిస్మత్ పూర్ కు చెందిన సంఘ సేవకుడు, వ్యాపారవేత్త గోకరి వీరార్జున గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై అన్నదానాన్ని స్వీకరించారు. కళ్యాణ మహోత్సవం అన్నదాన కార్యక్రమం నేపథ్యంలో దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



స్వర్గీయ ఇంద్రారెడ్డికి నివాళులర్పిస్తున్న డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శ్రావణ్ కుమార్ గౌడ్

## అమరుడు అందరి గుండెల్లో నిలిచిన మాజీ హోం మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి

### డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రావణ్ గౌడ్

శంషాబాద్, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) దివంగత మాజీ హోం శాఖ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి అమరుడు అని అందరి గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాడని డీసీఎంఎస్ మాజీ చైర్మన్. పాలమాకుల సింగిల్ విండో చైర్మన్ కే శ్రావణ్ కుమార్ గౌడ్ అన్నారు. దివంగత నేత ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా శంషాబాద్ మండలంలోని పాలమాకుల వద్ద గల ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు ఆయన అభిమానులు నివాళులు అర్పించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రావణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రవణ్ గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో ఇంద్రారెడ్డి మార్క్ ఎప్పుడు కనిపిస్తుందని అన్నారు. జిల్లాను అభివృద్ధి చేయడం కోసం నిరంతరం కృషిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి జీవించి ఉన్నంతకాలం రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఎంతో పోరాటం చేశారని అన్నారు. హోం శాఖ మంత్రిగా విద్యాశాఖ మంత్రిగా కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన జిల్లాలోని ప్రతి మనిషి గుండెలో ఉంటాడని శ్రావణ్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలమాకుల ఎంపిటిసి గుడాల ఇందిరా కృష్ణ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ నాయకుడు కూచిరెడ్డి చక్రధర్ రెడ్డి. రవీందర్ నాయక్. ఊమ్లా నాయక్. వై ప్రవీణ్ గౌడ్. నీళ్ల శ్రీధర్ గౌడ్. ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మే డే ఉత్సవాల పోస్టర్ ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు

## ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)ఫ ప్రపంచ కార్మికుల మే డే దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మిక లోకానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో గల ఏ ఐ టి యు సి జిల్లా కార్యాలయంలో మే డే గోడపత్రికను ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, మాజీ జిల్లా అధ్యక్షులు పుస్తకాల నర్సింగ్ రావు లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరా స్తున్నాయని ఆరోపించారు . కనీస వేతనాలు చట్టాన్ని సవరించక 15 సంవత్సరాలు అయినా పాలకులకు పట్టించుకోవటం లేదని విమర్శించారు. ప్రస్తుత కాలంలో ధరలు 400 శాతం పెరిగాయని అందుకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్ లుగా మార్చిన తర్వాత కార్మిక దోపిడి మరింత పెరిగిందని మండిపడ్డారు. మేడే సందర్భంగా కార్మికుల సమస్యలను దేశ ప్రజలు గుర్తించే విధంగా ప్రభుత్వాల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, కార్మిక నాయకులు రియాజ్, స్వామి, శేఖర్ రెడ్డి సత్తయ్య, గువ్వల రాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ వ్యవసాయ అధికారి అంజయ్య గౌడ్ జన్మదిన సందర్భంగా ఆయన చేత కేక్ కట్ చేయిస్తున్న బుద్వేల్ వాసులు

## ఘనంగా మాజీ వ్యవసాయ అధికారి అంజయ్య గౌడ్ జన్మదిన వేడుకలు

### అంజయ్య గౌడ్ చేత కేక్ కట్ చేయించిన బుద్వేల్ వాసులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ కు చెందిన రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి జి అంజయ్య గౌడ్ జన్మదిన వేడుకలను స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు కే శ్రీనివాస్ గౌడ్ ,ఎస్ కె నజీర్ ,జి హరి కిరణ్ గౌడ్ ,కోడిగంటి శేఖర్ రెడ్డి ,మూల రమేష్ గౌడ్ ,మూల నిరంజన్ గౌడ్ , పెండ్యాల దశరథ్ ,జి రవి కిరణ్ గౌడ్, నరేష్ గౌడ్, ఇబ్రహీం ఖాన్, రత్నాచారి ,సాగర్, వెంకటేష్, శంకర్ చారి, మూల సంతు గౌడ్, శివకుమార్ లు అంజయ్య గౌడ్ జన్మదిన కార్యక్రమంలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



మజ్లీస్ పార్టీతో చేరిన మహ్మద్ గౌస్ కు పార్టీ కండువా కప్పి ఆహానిస్తున్న శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్

## కాలా హనుమాన్ దేవాలయంలో హుండీ పగులగొట్టి చోరీ

బుద్వేల్, ఏప్రిల్22(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలా హనుమాన్ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉండి పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. హుండీ లో ఉన్న డబ్బులను తీసుకొని పారిపోయారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో హనుమాన్ దేవాలయములోకి వచ్చిన దుండగులు హుండీ తో పాటు విలువైన వస్తువులను కూడా దోచుకెళ్లారు. స్థానికు భక్తులు సోమవారం ఉదయం పూజారి తో పాటు దేవాలయం తీయగానే హుండీ తో పాటు విలువైన వస్తువులు ఉండకపోవడం పై వెంటనే పోలీసులకు సమాచారం అందజేసి ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



అత్తాపూర్ రాంబాగ్‌లోని కాలా హనుమాన్ దేవాలయం

## భారీ ర్యాలీతో నామినేషన్ పత్రాలు సమర్పించిన చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



ప్రచార రథంపై భారీ ర్యాలీతో నామినేషన్ వేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి



నామినేషన్ పత్రాల సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకురాలు రాణి రుద్రమ రెడ్డి, టి అంజన్ కుమార్, వనితా రెడ్డి లు



ర్యాలీలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోదరి గౌతమి రెడ్డి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ ర్యాలీ తో నామినేషన్ పత్రాలు సమర్పించారు. చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ రాజేందర్ నగర్ ఎమ్మార్వో ఆఫీస్ లో సమర్పించారు. అనంతరం భారీ ర్యాలీతో అంబేద్కర్ చౌరస్తా దగ్గర సభ నిర్వహించడం జరిగింది .చేవెళ్ల నుంచి భారీ మెజార్టీ గెలిపించాలని బిజెపి కార్యకర్తలకు అలాగే ఓటర్ లకు కొండ విశ్వ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నామినేషన్ లో బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహ రెడ్డి , రంగారెడ్డి అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి , వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు మాధవ రెడ్డి , అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి , సీనియర్ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, డాక్టర్ ప్రేమ్ రాజ్ , , మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకళ్ళ నరేందర్ రెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి , కార్పొరేటర్ సంగీత, బిజెపి నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, వై శ్రీధర్, బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనిత రెడ్డి, మురళీధర్ రెడ్డి ,శ్రీకాంత్, పవన్, మహేందర్ రెడ్డి ,పెంటారెడ్డి, రాకేష్ క్రాంతి ,,రాజ్పాల్ నిఖిల్, బాబురావు , అధిక సంఖ్యలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# జైశ్వాల్ సూపర్ సెంచరీ..

## ముంబైను చిత్తు చేసిన రాజస్తాన్

**ఐపీఎల్-2024లో రాజస్తాన్ రాయల్స్ తమ జోరును కొనసాగిస్తోంది. జైపూర్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో రాజస్తాన్ ఘన విజయం సాధించింది. 180 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 18.4 ఓవర్లలో ఛేధించింది.**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2024) లో 38వ మ్యాచ్ లో హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్- సంజూ శాంసన్ కెప్టెన్సీ లోని రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. జోరుమీదున్న రాజస్థాన్ రాయల్స్ హ్యాట్రిక్ విజయంతో ముంబైని చిత్తుగా ఓడించింది. దీంతో వరుస ఓటములతో ముందుకు సాగుతున్న ముంబైకి ప్లేఆఫ్ తలుపులు మూసుకుపోయినట్లు కనిపిస్తోంది. జైపూర్ లో జరిగిన ఈ మ్యాచ్ లో ముంబైపై 9 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. రాజస్థాన్ బ్యాటింగ్, బౌలింగ్ తో రాణించి అన్ని విధాలుగా ముంబైపై ఆధిపత్యం కనబరిచింది. గాయం నుండి తిరిగి వచ్చిన సందీప్ శర్మ ముంబైని పెద్ద స్కోర్ చేయకుండా అడ్డుకున్నాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఇది ముంబైకి కలిసిరాలేదు. కేవలం 6 పరుగుల స్కోరు వద్ద ఓపెనర్లు రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ వికెట్లు కోల్పోయారు. దీని తర్వాత సందీప్ శర్మ దుమ్మురేపే బౌలింగ్ తో ముంబై వెన్నువిరిచాడు. ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, టిమ్ డేవిడ్, గెరాల్డ్ కోయిట్జేలను సందీప్ శర్మ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు మాత్రమే సమర్పించుకుని వారి వికెట్లు తీసుకున్నాడు. గాయాం కారణంగా దూరంగా ఉన్న సందీప్ శర్మ మార్చి 28 తర్వాత బలమైన పునరాగమనం చేసాడు. రాజస్థాన్ తరపున అత్యుత్తమ బౌలింగ్ గణాంకాల పరంగా ఐపీఎల్ చరిత్రలో మూడవ స్థానంలోకి చేరుకున్నాడు. రోహిత్ నుంచి హార్దిక్ పాండ్యా వరకు ముంబై టాప్ బ్యాట్స్ మెన్ ఫ్లాప్ షో మధ్య తెలుగు కుర్రాడు తిలక్ వర్మ అద్భుతమైన ఆటతో రాణించాడు. తిలక్ వర్మ, నేహాల్ వధేరా జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ ను అందించారు. తిలక్ వర్మ 45 బంతుల్లో 3 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 65 పరుగులు చేశాడు. ఆ తర్వాత నెహాల్ వధేరా 24 బంతుల్లో 4 సిక్సర్లు, 3 ఫోర్ల సాయంతో 49 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌ల కారణంగా ముంబై స్కోరు 179కి చేరుకోగలిగింది. ముంబై స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ 6 పరుగులు, ఇషాన్ కిషన్ 0, సూర్యకుమార్ యాదవ్ 10 పరుగులు మాత్రమే చేశారు. హార్దిక్ పాండ్యా కూడా కేవలం 10 పరుగులకే పెవిలియన్ బాటపట్టాడు. ఐపీఎల్ 2024లో ప్రారంభం నుంచి ఫ్లాప్ షో చూపిస్తున్న యశస్వి జైస్వాల్ ముంబైపై బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. 60 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 104 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. జోస్ బట్లర్ కూడా 35 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. దీని తర్వాత కెప్టెన్ సంజూ శాంసన్ జైస్వాల్‌కు మద్దతుగా నిలిచాడు. శాంసన్ 28 బంతుల్లో 38 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు. ఈ గెలుపుతో రాజస్థాన్ జట్టు వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.





## రజనీ చిత్రం ఫస్ట్ లుక్‌పై భారీ స్పందన

సూపర్‌స్టార్ రజనీకాంత్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో ఒక చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రజనీ 171 వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ విడుదల చేయగా, రజనీకాంత్ అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను రాబట్టుకుంది. సినిమా టైటిల్‌ను విడుదల చేయనున్నట్లు లోకేశ్ తన సోషల్ మీడియాలో తెలపడంతో నెట్టింట ఇప్పుడు ఈ వార్త బాగా హల్‌చల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో కింగ్ నాగార్జున కీలక పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కు వచ్చి నాగార్జునకు స్టోరీ చెప్పడం, అది నచ్చి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో న్యూస్ చక్కర్లు కొడుతోంది. దీంతో మునుపెన్నడు చూడని మల్టీస్టారర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇప్పటికే రానా, దల్కర్ సల్మాన్ ఇందులో కనిపించబోతున్నట్లు తెలుస్తుండగా ఇటీవలే సీనియర్ నటి శోభన, శృతిహాసన్ కూడా ఈ చిత్రంలో భాగమవుతునట్లు వార్తలు వినిపిస్తుండడంతో ఈ సినిమాపై రోజురోజుకు అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. కాగా నాగార్జున తాజాగా ధనుష్ హీరోగా రూపొందుతున్న కుబేరా సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ చిత్రం టైమ్ ట్రావెల్ కథ అని కొందరు, లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ చిత్రాలలోని రోలెక్స్‌కు రిలేటెడ్‌గా ఈ సినిమా ఉండబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకు తంగమ్ అనే పేరు ఫైనెల్ చేసినట్లు తెలుస్తోండగా జూన్‌లో ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లి ఈ ఏడాది చివరకు సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అన్బరివు స్టంట్స్, అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. దీని తర్వాత 'ఖైదీ 2' మొదలు పెట్టనున్నట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో లోకేష్ తెలిపాడు. రజనీకాంత్ నటించిన తాజా చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.



## ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌తో టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు

ఇద్దరు స్టార్స్ ఒక దగ్గరికి చేరితే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వారిద్దరిని చూడడానికి వారి ఫ్యాన్స్ ఎంతో ఆనందిస్తారు. ఇకపోతే తాజాగా తెలుగు చిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్ గా పేరుగాంచిన మహేష్ బాబు అంటే టాలీవుడ్ లో ఎనలేని క్రేజ్. అలాగే ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ లో ప్రత్యర్థులను ఊచకోత కోస్తున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కు కూడా చాలా మందే ఫ్యాన్స్ ఉన్నారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ పాట్ కమ్మిన్స్, సూపర్ స్టార్ మహేష్ బాబు ఇద్దరు కలిశారు. కాకపోతే ఇది బయట ఎక్కడో పబ్లిక్ ప్లేస్ లో కాదు. ఓ యాడ్ షూటింగ్ సంబంధించి విరిద్దరూ కలిశారు. ఈ నేపథ్యంలో వారు ఇద్దరు కలిసి కొన్ని ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ఆ తర్వాత ఇద్దరూ ముచ్చటించారు. ఈ విషయాన్ని తాజాగా ఎస్ఆర్?హెచ్ కెప్టెన్ తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపాడు. ఇందులో భాగంగా టాలీవుడ్ ప్రిన్స్ తో ఈ మధ్యాహ్నం తాము సరదాగా గడపామని పేర్కొన్నాడు.దీంతో హైదరాబాద్ టీం క్రికెట్ ఫ్యాన్స్, అలాగే మహేష్ బాబు ఫ్యాన్స్ తెగ సంబరాలు చేసుకుంటున్నారు. ఇదివరకే మహేష్ బాబు అనేకసార్లు తనకి క్రికెట్ ఆడడం అంటే చాలా ఇష్టమని చెప్పిన సంగతి మనకు తెలిసిందే. చాలాసార్లు కూడా ఐపీఎల్ లో సన్ రైజర్స్ కు సపోర్ట్ చేయడానికి కూడా వచ్చారు. ఇక పాట్ కమ్మిన్స్ షేర్ చేసిన ఫోటోను మహేష్ బాబు రీ ట్వీట్ చేస్తూ.. ఇది నాకు గౌరవంతో కుడైన అభిమానం అంటూ తెలుపుతూ.. తాను కూడా అతనికి అభిమానిని అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది....

## శరవేగంగా విశ్వంభర షూటింగ్

### సంక్రాంతికి విడుదల చేసేలా ప్లాన్

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. 'భారీ సెట్‌లో యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ పూర్తయింది. 26 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఇంటర్వెల్ ఫైటింగ్ సీన్స్‌ను చిత్రీకరించారు. ఇందుకోసం 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని రూపొందించారు. ఈ సన్నివేశం సినిమాకే అదనపు ఆకర్షణ కానుంది. యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్ లక్ష్మణ్ పర్యవేక్షణలో దీన్ని చిత్రీకరించారు. హైలెవెల్ వీఎఫ్ఎక్స్‌లతో ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు' అని సినీ వర్గాల వెల్లడించాయి. ఇటీవల హనుమాన్ విగ్రహం వద్ద చిరు దిగిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరలైన సంగతి తెలిసిందే. ఇది సినిమాలో ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. సోషియో ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. 18 ఏళ్ల తర్వాత చిరు-త్రిష ఈ సినిమా కోసం కలిసి నటిస్తుండడంతో దానిపై అభిమానుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యమిస్తూ రూపొందిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. దాదాపు రూ.200 కోట్ల భారీ బ్జడెట్‌తో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు టాక్. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక బ్జడెట్‌తో రూపొందుతున్న సినిమాగా ఇది నిలవనుంది. ఇక దీనిలో త్రిష ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు టాక్. ఆమెతో పాటు సురభి, ఇషాచావ్లా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.





## చిట్టి కాలికి పచ్చబొట్టు..

'అల్లరి' నరేశ్, 'చిట్టి' ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న చిత్రం ఆ ఒక్కటీ అడక్కు. సోమవారం (ఏప్రిల్ 22న) ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫరియా తన కాలికి టాటూతో కనిపించింది. ఎడమ కాలిపై ఎర్రటి వేర్ల గీతలు ఉన్నాయి. దానిపై నీలి ఆకారంలో వృత్తం ఉంది. ఇది చూసిన ఓ పాత్రికేయుడు.. ఆ టాటూ రహస్యమేంటని అడిగాడు. దీనికి ఫరియా స్పందిస్తూ.. వేర్లు బలంగా ఉంటేనే మొక్క ధృడంగా నిలబడగలుగుతుంది. అలాగే మనం ఎంతో ఒదిగి ఉంటేనే ఇంకా ఎక్కువ ఎత్తుకు ఎదుగుతాం. సెలబ్రిటీ లైఫ్‌లో ఒదిగి ఉండటం ఎంతో అవసరం. ఆ విషయాన్ని నాకు పదేపదే గుర్తు చేయాలనే ఉద్దేశ్యంతో ఇలా పచ్చబొట్టు వేయించుకున్నాను అని చెప్పుకొచ్చింది. ఆ ఒక్కటీ అడక్కు సినిమా విషయానికి వస్తే ఈ చిత్రం మే 3న విడుదల కానుంది.



### తేజ సజ్జ 'మిరాయ్'లో

## యోధుడిగా స్టార్ హీరో!



'హను-మాన్'తో తేజ సజ్జ పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 350 కోట్లకు పైగా వసూళ్లను సాధించి రికార్డు క్రియేట్ చేసింది. బరిలో ఒకవైపు సూపర్‌స్టార్ మహేశ్ బాబు 'గుంటూరు కారం', వెంకటేశ్'సైంధవ్', నాగార్జున 'నా సామిరంగ' లాంటి బడా చిత్రాలు ఉన్నప్పటికీ.. వాటన్నింటిని తట్టుకొని బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాడు. ఇక హను-మాన్' తర్వాత తేజ ఎలాంటి సినిమా ప్రకటిస్తాడోనే అనే క్యూరియాసిటి అందరిలోనూ మొదలైంది. సినీ ప్రియుల అంచనాలకు తగ్గట్టే 'మిరాయ్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇది కూడా సూపర్ హీరో కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న సినిమానే. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్, గ్లింప్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. మంచు మనోజ్ కూడా ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించబోతున్నాడు. చిత్ర బృందం కూడా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అయితే ఇందులో మనోజ్‌తో పాటు మరో స్టార్ హీరో కూడా నటించబోతున్నట్లు తెలుస్తోంది. సీతరామం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన దుల్కర్ సల్మాన్..మిరాయ్‌లో కీలక పాత్ర పోషించబోతున్నారట. ఈ చిత్రంలో దుల్కర్ ఓ యోధుడిలా కనిపించబోతున్నాడని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది.త్వరలోనే చిత్రం బృందం అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించే అవకాశం ఉంది.

## రామ్‌చరణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది

### బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్

ఆపరేషన్ వాలెంటైన్'తో తెలుగువారికి పరిచయమైన బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న ఆమె .. రామ్‌చరణ్‌ను తాను ఎంతగానో అభిమానిస్తున్నట్లు చెప్పారు. 'చరణ్ అంటే నాకెంతో ఇష్టం. డ్యాన్స్ అద్భుతంగా ఉంటుంది. ఎప్పటి నుంచో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని అనుకుంటున్నా. నా తదుపరి తెలుగు సినిమా ఆయనతోనే ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'బడే మియా ఛోటే మియా' కోసం వయసులో తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన అక్షయ్ కుమార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ఆమె స్పందించారు. 'ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వయసులో పెద్దవారైన పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించడానికి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే, స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్నప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించవచ్చు. అక్షయ్ కుమార్ సూపర్ స్టార్. ఆయనతో వర్క్ చేయడాన్ని నేనెంతగానో ఎంజాయ్ చేశా. ఎంతోమంది ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుకుంటారు. కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. తమ చిత్రాల్లోకి నటీనటులుగా ఎవరిని తీసుకోవాలనేది పూర్తిగా దర్శకుల నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా మాట్లాడాలనుకోవడం లేదు. అగ్ర నటులతోనే కాకుండా యువ హీరోల చిత్రాల్లోనూ నటించాలనుకుంటున్నా' అని ఆమె తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.